www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 18 ఏప్రిల్ 2025
5
ఏలూరు



పోలవరం ప్రాజెక్టులో మట్టి నాణ్యత పరీక్షలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు పరిధిలో మట్టి నాణ్యత పరీక్షలు రెండో రోజు గురువారం కూడా కొనసాగాయి. సెంట్రల్ మెటీరియల్ అండ్ సాయిల్ రీసెర్చ్ సెంటర్ నిపుణులు బి.సిద్ధార్ద్ హెడావో, విపుల్ కుమార్ గుప్తా, జలవనరుల శాఖ అధికారి నిర్మల, తదితరులు రెండోరోజు దండంగి, పోలవరం జల విద్యుత్ కేంద్రం పరిసరాలతో పాటు పలు ప్రాంతాల్లో మట్టి నమూనాలు సేకరించారు. ఈ మట్టిని స్థానికంగా లేబరేటరీలో పరీక్షించడంతో పాటు, మరింత సూక్ష్మంగా తమ కేంద్ర కార్యాలయంలో పరీక్షించేందుకు సేకరించారు. స్థానికంగా, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ సెంటర్లో నిర్వహించే పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా పోలవరం ప్రాజెక్టులో అవసరమైన ప్రాంతాల్లో అవసరమైన మేర ఈ మట్టిని వినియోగిస్తామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. మట్టి నాణ్యతా పరీక్షల్లో జలవనరుల శాఖ డిఇ వి.నిర్మల, ఇఇ డి.శ్రీనివాసులు, నిర్మాణ సంస్థ మేఘా ఇంజినీరింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జెడ్‌పి నిధుల్లో వివక్ష ఎందుకు..!

తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి రూ.ఏడు కోట్లే కేటాయించారన్న బొలిశెట్టి

నిధులపై ఆచంట, వీరవాసరం జెడ్‌పిటిసిలు వైఎస్ ఛైర్మన్ మధ్య వాగ్వివాదం

జులైలో వరద పంట నష్టపరిహారం అందించాలన్న ఎంఎల్ఎ ఆరిమిల్లి

టిఆర్ 126 రకం ధాన్యం కొనుగోలు సమస్యలపై చర్చ

ఏజెన్సీలో తాగునీటి సమస్య పరిష్కరించాలన్న ఎంఎల్ఎ చిర్రి

తాగునీటి సమస్య లేకుండా చర్యలు ; జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

సమావేశానికి రాని అధికారులకు చర్యలకు ఛైర్‌పర్సన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ


నిధుల కేటాయింపుపై వాదులాడుకుంటున్న జెడ్‌పిటిసిలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ నిధుల కేటాయింపులో వివక్ష ఎందుకంటూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వాడీవేడిగా చర్చ సాగింది. ఇటీవల ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలోనూ దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ జెడ్‌పి నిధుల కేటాయింపులపై ప్రస్తావించడం మరోసారి చర్చకు దారి తీసింది. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ హాల్లో గురువారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్ఎలు ఆరిమిల్లి రాధాకృష్ణ, చిర్రి బాలరాజు, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జెడ్‌పిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ప్రతి నియోజకవర్గానికి రూ.25 కోట్లు కేటాయించారని, తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి మాత్రం రూ.ఏడు కోట్లు మాత్రమే మంజూరు చేశారని, భవిష్యత్తులో జిల్లా పరిషత్తు నుండి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. వీరవాసరం, ఆచంట జనసేన, టిడిపి జెడ్‌పిటిసిలు గుండా జయ ప్రకాష్‌నాయుడు, సురేష్ బాబు గత ప్రభుత్వంలో జెడ్‌పి నిధుల తమ మండలాలకు సరిగ్గా కేటాయించలేదంటూ ప్రస్తావించారు. దీంతో వైసిపి జెడ్‌పిటిసి, వైఎస్ ఛైర్మన్ పి.విజయబాబు గతంలో నిధులు కేటాయించారంటూ కాగితాలు చూపించేందుకు వెళ్లగా వారి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. కాగితాల్లో మాత్రమే చూపించారని నిధులు మాత్రం కేటాయించలేదంటూ జెడ్‌పిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ జులైలో కురిసిన అధిక వర్షాల వల్ల పంటలు కోల్పోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకా జమ కాలేదని, వెంటనే జమయ్యేలా చూడాలని కోరారు. అధిక దిగుబడి అందించే టిఆర్ - 126 ధాన్యం రకం సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ఆ ధాన్యాన్ని ధాన్యం ఆరబెట్టే ప్రదేశాలు కలిగిన మిల్లులకు నేరుగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు మాట్లాడుతూ పోలవరం ఏజెన్సీ ఏరియాలో ఏడు మండలాలు 121 గ్రామాలు ఉన్నాయన్నారు. ఓవెహ్ ఆర్ఎస్ మంజూరైనా పనులు మొదలు కాక తాగునీటికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలకు 18 నెలలుగా రావాల్సిన గౌరవవేతనం బకాయిలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తణుకు సమీపంలో పశువుల మాంసం కేంద్రం కారణంగా పర్యావరణానికి విఘాతం కలుగుతుందని, ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలి తెలిపారు. తాగునీటి సమస్యపై చర్యలు తీసుకోవాలంటూ ఎంఎల్ఎలు, జెడ్‌పిటిసిలు సమావేశంలో అత్యధికంగా ప్రస్తావించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ, భీమేశ్వరరావు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల జాయింట్ కలెక్టర్లు టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఎస్.చిన్నరాముడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై పటిష్ఠ చర్యలు : జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ప్రస్తుత వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో కృష్ణా, గోదావరి కాలువలను కట్టివేసే తేదీని ఈ నెల 22వ తేదీ వరకూ పొడిగించినందున, ఈలోగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని తాగునీటి నీటి వనరులను పూర్తి స్థాయిలో నింపుకోవాలని, కాల్వల ద్వారా శివారు ప్రాంతాలకు నీరందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా బోర్లు ఏర్పాటు చేయాలని, మరమ్మతులకు గురైన బోర్లకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. మండలంలో చేపట్టే ప్రభుత్వ అధికారిక అభివృద్ధి పనులు ప్రోటోకాల్ ప్రకారం జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఇతర ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని లేకపోతే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ జెడ్‌పి సిఇఒను ఆదేశించారు.

తూతూమంత్రంగా స్థాయి సంఘాల సమావేశాలు

జెడ్‌పిలో ఏడు స్థాయి సంఘాలు ఉంటాయి. ఈ సమావేశాలు విడిగా జరపకుండా గతానికంటే భిన్నంగా సమావేశం హాల్లోనే గంపగుత్తగా సాగించేశారు. దీంతో స్థాయి సంఘాల సమావేశాలు తూతూమంత్రంగా ముగిశాయి. అధికారులు అంటేలు వల్లిస్తూ ముగించేశారు. జెడ్‌పిటిసిల ప్రతిస్పందన పెద్దగా లేకుండానే ముగిసిపోయాయి. విడిగా నిర్వహించాల్సిన స్థాయి సంఘాల సమావేశాలు ఇలాగేనా నిర్వహించడం నిర్వహించడంద అన్న చర్చ సాగింది.

నిరక్షరాస్య మహిళలను గుర్తించాలి

ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ ధాత్రిరెడ్డి



ప్రజాశక్తి - ఏలూరు

నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులను చేసేందుకు నిర్వహించే ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 16 నుండి 20వ తేదీ వరకూ సర్వే నిర్వహించి, జిల్లాలో నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించాలని ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తించిన నిరక్షరాస్యులకు మే 5వ తేదీ నుండి సెప్టెంబరు 18వ తేదీ వరకూ వాలంటీర్ టీచర్లతో తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం సెప్టెంబరు నెలాఖరులో వారికి తుది పరీక్షలు నిర్వహించాలన్నారు. ఉల్లాస్ 2025 - 26 అక్షరాస్యతా కార్యక్రమంలో జిల్లాలో డిఆర్‌డిఎ, మెప్మా ఆధ్వర్యంలోని డ్వాక్రా గ్రూపుల్లో నిరక్షరాస్యులైన గ్రూపు మహిళలను అక్షరాస్యులుగా చేయడం జరుగుతుందన్నారు. గతేడాది ఉల్లాస్ కార్యక్రమంలో మొదటి విడతగా 7,321 మందికి డిజిటల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీ, ఫంక్షనల్ లిటరసీ కార్యక్రమాన్ని డ్వాక్రా గ్రూపుల్లోని నిరక్షరాస్యులైన మహిళలకు ఏర్పాటు చేసి తరువాత పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. సదరు పరీక్షకు 7,285 మంది హాజరై ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇదే విధంగా 2025–26లో 20,199 మంది నిరక్షరాస్య మహిళలను డిఆర్‌డిఎ డ్వాక్రా గ్రూపు నుంచి 11,017 మంది, మెప్మా నుంచి 9,182 మంది నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంగా నిర్ణయించామన్నారు. కార్యక్రమం మొత్తం వయోజన విద్యా శాఖ వారి ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో వయోజన విద్య ఏలూరు జిల్లా నోడల్ అధికారి కెవిబి.సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, మెప్మా పీడీ హెప్సిబా, డిఇఒ వెంకట లక్ష్మమ్మ, ఐసిడిఎస్ పీడీ పి.శారద, డివిజనల్ పంచాయతీ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర మిషన్‌లో భాగస్వామ్యం కావాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

స్వచ్ఛ ఆంధ్ర మిషన్‌లో భాగంగా కాలువల శుభ్రత, సుందరీకరణ కార్యక్రమంలో విస్తృత ప్రజా భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్, ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఏలూరులోని చారిత్రాత్మక కాలువల్లో ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను తొలగించి వాటిని మళ్లీ జీవంతో నింపి శుభ్రమైన సుందరమైన ఆహ్లాదకర ప్రదేశాలుగా మార్పు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టును తొలుత కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు జరిపి, వాటి ఫలితాలను అనుసరించి ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో బహుముఖంగా విస్తరించేందుకు ప్రణాళికలను రూపొంది స్తున్నామన్నారు. ఈ బహుళ ప్రాయోజిత కార్యక్రమంలో పౌరులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థలు సమీపంలోని ఒక కాలువ ప్రాంతాన్ని దత్తత తీసుకోవడం ద్వారా ఉత్సాహంగా పాల్గొని తద్వారా దీర్ఘకాలిక, పర్యావరణ ప్రయోజన సాధనకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. సదరు కార్యక్రమం ఈ నెల 19వ తేదీన స్థానిక ఏలూరు రైల్వే స్టేషన్ వద్ద ఉన్న కృష్ణా కాలువ వద్ద ప్రారంభించనున్నట్లు తెలిపారు. స్వచ్ఛ ఏలూరు సాధన కోసం ఆసక్తి గల ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె ఆహ్వానించారు. చేయి చేయి కలిపి మన కాలువలను పునరుద్ధరించి, ప్రజా ప్రదేశాలను తిరిగి నిర్మించుకోవడం ద్వారా శుభ్రమైన ఏలూరును పునర్మించుకుందామని ఆమె పిలుపునిచ్చారు.

కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కొల్లేరు ప్రాంత ప్రజల వాదనలు వినిపించేందుకు సుప్రీంకోర్టు మూడు నెలల వెసులుబాటు కల్పించడం శుభ పరిణామమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి మొదటి అడుగు పడిందని ఎంపీ తెలిపారు. తనతో పాటు కైకలూరు, దెందులూరు, ఉంగుటూరు ఎంఎల్ఎలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి చేసిన కృషి ఫలించిందని ఎంపీ స్పష్టం చేశారు. కొల్లేరు సరిహద్దులు నిర్ణయించాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అధికారులు చేపట్టిన చర్యలతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురి కావాల్సిన పరిస్థితిని ఎంఎల్ఎలు, టిడిపి జిల్లా అధ్యక్షుడు, తాను సిఎం చంద్రబాబును, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ను కలిసి వివరించినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన వారు కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ వచ్చారన్నారు. కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇచ్చిన భరోసా మేరకు సుప్రీంకోర్టు ఆశ్రయించినట్లు ఎంపీ తెలిపారు.

జాన్‌వెస్లీకి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో చోటు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


సర్టిఫికెట్ అందుకుంటున్న జాన్ వెస్లీ

మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన రెవ జంగా.జాన్ వెస్లీ సంగీతంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించారు. విజయవాడ హోలేల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా డిసెంబరు ఒకటో తేదీ 2024న నిర్వహించబడిన ప్రపంచ స్థాయి ఆన్‌లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో పాల్గొని కీబోర్డు వాయిస్తున్న సంగీత కళాకారుల బృందంతో గంటలో 1046 వీడియోలు అప్లోడ్ చేశారు. ఈ నేపథ్యంలో జాన్ వెస్లీని గుర్తించి హైదరాబాద్ మణికొండలో ఉన్న ద లైఫ్ చర్చిలో జరిగిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ కార్యక్రమంలో హోలేల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ పాస్టర్ ఆగస్టీన్ (దండంగి వేణుగోపాల్) సర్టిఫికెట్ అందజేయగా, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థ ప్రతినిధులు ఆనంద్ రాజన్ గారి చేతుల మీదుగా మెడల్ అందజేశారు.

కొల్లేరు ప్రజలను రక్షించాలి

సిపిఎం జిల్లా కమిటీ సమావేశంలో సిపిఎం రాష్ట్ర నాయకులు బి.బలరాం, మంతెన సీతారాం



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్లేరు ప్రజలను రక్షించాలని, ఆక్వా రంగాన్ని కాపాడాలని, రొయ్యల రైతులను ఆదుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలు ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర నాయకులు బి.బలరాం, మంతెన సీతారాం డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేటలోని ఉద్దరాజు రామం భవనంలో గురువారం సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మొడియం నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు ప్రజా సమస్యలపై తీర్మానాలు చేసి ఆమోదించారు. ఈ సమావేశానికి ముఖ్యవక్తలుగా విచ్చేసిన సిపిఎం రాష్ట్ర నాయకులు బి.బలరాం, మంతెన సీతారాం మాట్లాడుతూ కొల్లేరులో పక్షులనే కాకుండా అక్కడ వేల సంవత్సరాలుగా జీవిస్తున్న ప్రజలను కూడా రక్షించాలని, కొల్లేరును 5 నుండి 3వ కాంటూరుకు కుదించాలని, కొల్లేరు ప్రజలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సొసైటీలు, జిరాయితీ భూములను పునరుద్ధరించాలని, మిగులు భూములు కొల్లేరు పేదలకు పంచాలని, కొల్లేరు గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ ఇచ్చిన హామీని, జస్టిస్ మిత్రా కమిటీ, శ్రీరామకృష్ణయ్య కమిటీ, అసెంబ్లీ కమిటీల సిఫార్సులు అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు గ్రీన్ ట్రిబ్యునల్ కేసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఇంప్లీడ్ పిటీషన్ వేయాలని కోరారు. కొల్లేరు కాలుష్యానికి అక్కడి ప్రజలు కారణం కాదని, ఫ్యాక్టరీ ద్వారా వస్తున్న వ్యర్థాలేనని స్పష్టం చేశారు. కొల్లేరులోకి వచ్చే మురుగు డ్రెయిన్లు బాగు చేయాలని, ఆధునికీకరించాలని, తుమ్మ, కిక్కిస, గుర్రపుడెక్క తొలగించాలని డిమాండ్ చేశారు. ఆక్వా రంగాన్ని కాపాడాలన్నారు. అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం ప్రతీకార సుంకాల పేరుతో భారత్ ప్రభుత్వంపై పెట్టిన భారం ఫలితంగా రాష్ట్రంలో ముఖ్యంగా ఆక్వా రైతాంగంపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. తద్వారా రొయ్యల రైతులు నష్టాలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం 100 కౌంట్‌కు చెందిన రొయ్యల ధర రూ.220 రూపాయలకు కొనాలని నిర్ణయించడం అన్యాయమని, ఆ ధరను రూ.270లకు పెంచాలని అన్నారు. వ్యాపారులు సిండికేట్ అయి తక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకే వ్యాపారులు కొనుగోలు చేసేలా చూడాలని, ఫీడ్ ధరలు తగ్గించాలని, నాణ్యమైన సీడ్ అందించాలని, విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను పెంచడం దుర్మార్గమన్నారు. పట్టణాల్లో పెంచిన ఆస్తి (ఇంటి) పన్ను తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు చేయాలని కోరారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఉపాధి హామీ వేతన బకాయిలు 3 నెలలుగా జిల్లాలో ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వేసవిలో ఉపాధి హామీ పనులు జిల్లాలోని గ్రామాలతో పాటు పట్టణాల్లో కూడా అమలయ్యే విధంగా చూడాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఏజెన్సీలోని భూ సమస్యల విషయంలో పోలీస్, రెవెన్యూ అధికారుల జోక్యం ఉండరాదని, 1/70 చట్టాన్ని పట్టిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని, నిర్వాసిత కాలనీల్లో మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, జి.రాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, ఇతర జిల్లా నాయకులు ఎం.జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, మడకం సుధారాణి, వై.నాగేంద్రరావు, ఎస్.మహంకాళీరావు, హనుమాన్లు, తదితరులు పాల్గొన్నారు.

లారీని కారు ఢీకొని ఒకరు మృతి

ఏడుగురికి గాయాలు, వారిలో ఇద్దరి పరిస్థితి విషయం

బిటెక్ విద్యార్థులు భద్రాచలం వెళ్తుండగా ప్రమాదం



సంఘటన స్థలంలో కోమటి స్వామి మృతదేహం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం శశి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఇటీవల జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడంతో భద్రాచలం దర్శనానికి అద్దెకు కారును తీసుకుని బయలుదేరారు. కారు జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వెళ్తున్న లారీతో ఓవర్‌టెక్ చేయబోయి ఎదురుగా వస్తున్న మరో లారీని కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న కోమటి స్వామి అక్కడికక్కడే మతి చెందాడు. అజయ్‌కుమార్, నరేష్, ప్రమోద్, రాహుల్, హరిహరన్, హేమంత్, శ్రీనివాస్ గాయాలపాలయ్యారు. వీరందరిని స్థానికులు 108లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో రాహుల్, ప్రమోద్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో ఏలూరు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్టగూడెంలో విషాదం

టి.నరసాపురం : జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మండలంలోని మెట్ట గూడెం గ్రామానికి చెందిన యువకుడు కోమటి స్వామి (18) మృతి చెందాడు. గ్రామానికి చెందిన కోమటి జయరాజు, హేమలత దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు స్వామి తాడేపల్లిగూడెం శశి ఇంజినీరింగ్ కాలేజీలో బిటెక్ పూర్తి చేశాడు. రెండో సంవత్సరం పాసైన సందర్భంగా గురువారం ఉదయం తన స్నేహితులతో కలిసి భద్రాచలం ఆలయాన్ని దర్శించుకుని మొక్కు తీర్చుకునేందుకు కారులో తాడేపల్లిగూడెం నుంచి జంగారెడ్డిగూడెం మీదుగా భద్రాచలం వెళ్తుండగా చోటు చేసుకున్న ప్రమాదంలో స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మెట్టగూడెంలో విషాదం అలుముకుంది.


స్వామి (ఫైల్‌ఫోటో)

ఇంక్రిమెంట్, పెండింగ్ జీతాల సమస్యలు పరిష్కరించాలి

పిహెచ్‌సి ఎదుట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన

త్వరలో జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు



నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు టి.నరసాపురం పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గురువారం నిరసన బాట పట్టారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర, ఒపి సేవలు మినహా మిగతా అన్ని సర్వేలు, ఆన్‌లైన్ వర్క్స్ నిలుపుదల చేసినట్లు వారు తెలిపారు. సమ్మె నిమిత్తం మెడికల్ ఆఫీసర్ ఫణీంద్రబాబుకు నోటీసు ఇవ్వగా ఆయన తీసుకోవడానికి నిరాకరించారని వారు తెలిపారు. మెడికల్ ఆఫీసర్ నిరాకరించడంతో ఇది న్యాయమైన డిమాండ్ల కోసం చేసే రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమమని వివరించినప్పటికీ ఆయన వినకపోవడంతో నోటీసు ఫిర్యాదు బాక్సులో వేసి కార్యాచరణలో భాగంగా శాంతియుత నిరసన చేసినట్లు చెప్పారు. న్యాయమైన డిమాండ్లు అయిన ఇంక్రిమెంట్, పెండింగ్ జీతాలు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని, త్వరలో జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌కె.రాజు, ఎస్.సిద్ధయ్య, బి.నాగబాబు, ఎస్.విజయ రామరాజు, జి.రాజ్యలక్ష్మి, కె.అనూష, ఇ.ప్రసన్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోండి

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్


వృద్ధులతో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

న్యాయ సంబంధిత సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తున్న న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ చెప్పారు. పట్టణంలోని పత్తేబాదలో ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని ఆయన గురువారం సందర్శించారు. వసతి గృహంలో వృద్ధులకు అందుతున్న వసతులపై, ఆహార పదార్థాల నాణ్యత, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారితో మాట్లాడుతూ న్యాయ సంబంధిత సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను పొందడంలో ఉన్న సమస్యలను అర్జీ రూపంలో ఇస్తే సంబంధిత అధికారుల ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అవసరమైతే పారా లీగల్ వాలంటీర్ల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పరిసరాల శుభ్రతను మరింత మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఉందని, ప్రస్తుతం దోమలు బెడద ఎక్కువగా ఉందని, నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.


పాటలకు డ్యాన్స్ వేస్తున్న విద్యార్థినులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం సందడిగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బేతాళ రాజేంద్రప్రసాద్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సందర్భంగా విద్యార్థుల ఆట పాటలతో సందడి చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చక్రధర్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే సక్రమంగా చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో రీ సర్వే సక్రమంగా చేయడంలేదని వీఆర్ఓ, సచివాలయ సిబ్బందిపై తహశీల్దార్ కె.రాజకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అక్కిరెడ్డి గూడెం, తాళ్లవల్లి గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కిరెడ్డిగూడెంలో రీ సర్వే విషయంలో వీఆర్ఓ, సచివాలయ సిబ్బంది అలసత్వం వహిస్తున్నారన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా సక్రమంగా రీ సర్వే చేయాలని ఆదేశించారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ రాజకుమార్

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి భూమికి జీవం పోయాలని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్ అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ కుమార్ మాట్లాడుతూ రసాయన వ్యవసాయం వల్ల నిస్సారమౌతున్న భూమి ప్రకృతి వ్యవసాయంతోనే సారవంతమవుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి వేణుమాధవ్ మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్ల పెంపకం ఉపయోగాల గురించి వివరించారు. 23 రకాల పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రకృతి సేద్యం చేస్తున్న పలువురు రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఇన్‌ఛార్జి నాగ విజయ, నారాయణ, సుధాకర్, అనూష, నళిని, జగన్ వెంకట సుబ్బారావు, రామారావు, రమేష్, వివిఎల సాయి, రైతులు నరేష్, రాధాకృష్ణ, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో గుర్తింపు

ప్రజాశక్తి - భీమడోలు

సేవా కార్యక్రమాలను చేపట్టడం ద్వారా ప్రజల గుర్తింపు, నమ్మకాన్ని పొందవచ్చని ఎంఎల్‌సి సోము వీర్రాజు అన్నారు. మండలంలో ఆయన గురువారం పర్యటించారు. దీనిలో భాగంగా వడ్లపట్ల గ్రామంలో బిజెపి నాయకులు వర్దినేడి కిషోర్‌బాబు ఆర్థిక సహాయంతో నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రం మంజూరు చేస్తున్న జల జీవన్ మిషన్ నిధుల వినియోగంలో చొరవ చూపుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు సిహెచ్.కిషోర్, శరణాల మాలతీరాణి, ప్రవీణ్ పటేల్, వెజ్జు ధర్మారావు, జనసేన పార్టీ నాయకులు పత్తి మదన్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

జనసేన మండలాధ్యక్షులు మధుబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

జనసేన కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటామని జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు అన్నారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీ నరసింగాపురం గ్రామంలో మధ్యాహ్నపు సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబం ఉండటానికి ఇల్లు కూడా లేకపోవడంతో మధ్యాహ్నపు సూరిబాబుకు గురువారం చీదరాల మధుబాబు చేతుల మీదుగా రూ.22 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగోపు సూర్యచంద్రరావు, మాదాసు రాంబాబు, ప్రగడవరం గ్రామ అధ్యక్షులు కోసాన చంద్రబాబు, మధ్యాహ్నపు వెంకన్న, జనసేనపార్టీ నాయకులు కుమార్, మాదాసు అజయ్, తోట ప్రసాద్, బంటు లక్ష్మణరావు, కాలాబత్తుల రాజేష్, పార్టీ గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న మధుబాబు

నేరాలు - ఘోరాలు

ఐస్‌క్రీమ్ పార్లర్‌లో తనిఖీలు

కాలం చెల్లిన ఫ్లేవర్స్ సీజ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులో చందన బ్రదర్స్ కాంప్లెక్స్‌లో ఉన్న గౌతమి ఐస్ క్రీమ్ పార్లర్ షాపులో ఐస్‌క్రీమ్ ఐటమ్స్‌లో కాలం చెల్లిన కెమికల్స్, ఫ్లేవర్స్ వాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామరాజు, విజిలెన్స్ సిఐ ప్రసాద్ కుమార్ నేతృత్వంలో గురువారం షాపులో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో బాదం మిల్క్, గ్రేప్స్ మిక్స్‌లో కలిపే ఫ్లేవర్స్ కాలం చెల్లినట్లు తేల్చి వాటిని సీజ్ చేశామని ఆహార తనిఖీ అధికారులు తెలిపారు. ముదురుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని, ప్రజలు బయట విక్రయించే కలుషిత ఆహార పదార్థాలు, బాదం, ద్రాక్షా శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు సేవించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న అధికారులు

వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ముసునూరు

నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో గతంలో గతంలో కేసు నమోదైన చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన మిడతా శ్రీనును అదుపులోకి తీసుకుని రిమాండ్ నిమిత్తం నూజివీడు కోర్టుకు తరలించినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు.

విద్యార్థులకు వీడ్కోలు సభ

ప్రజాశక్తి - భీమడోలు

అన్నేవారిగూడెం ఎంపిపి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాలను వీడుతున్న 26 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు మస్తాన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాల్లో విద్యాభ్యాసానికి వెళ్లే విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యను నేర్చుకునేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఇదేవిధంగా సమగ్ర శిక్ష పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న స్టడీ కార్యక్రమానికి భీమడోలు నెంబర్-4 ఎంపిపి ప్రాథమిక పాఠశాల నుంచి ఎంపికైన ఇద్దరు విద్యార్థులు అంతర్రాష్ట్ర పర్యటనకు గురువారం బయలుదేరి వెళ్లారు. పలు అంశాలను అధ్యయనం చేస్తారని ఎంఇఒలు భాస్కర కుమార్, శ్రీనివాసరావు తెలిపారు. ఒకరోజు పర్యటన అనంతరం తిరిగి వారు స్వస్థలాలకు చేరుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలియజేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని గొల్లపల్లిలో ఉన్న అనే రామకృష్ణయ్య జెడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా నూజివీడు అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి మత్తయ్య అగ్ని ప్రమాదాలను ఏ విధంగా అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కులే జీవితమా అంశంపై అవగాహన

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు మార్కులే జీవితమా అంశంపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదల కానున్న సందర్భంగా ఏలూరు సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పంకజం, జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి నవీన ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు ధీరజ్ సాయికుమార్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారి స్వాతి, కుక్కునూరు కెజిబివి ప్రత్యేక అధికారి సుశీల, వేలేరుపాడు కెజిబివి ఉపాధ్యాయులు భూలక్ష్మి పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని కొత్త రావిచర్ల గ్రామంలో క్లాప్ మిత్రలకు రెండో రోజు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాంధీ ఆశయ సాధనలో భాగంగా పల్లెలు పరిశుభ్రంగా ఉండాలని, స్వయం పోషకంగా ఎదిగేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి సంపదను సృష్టించడమే తొలి స్వయం పోషకంగా గుర్తించాలన్నారు. ముసునూరు ఎంపిడిఒ జి.రాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి ఎంపిడిఒ, అధికారులు, క్లాప్ మిత్రులు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీవారికి రూ.1.93 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం హుండీలు గురువారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడచిన 20 రోజులకు రూ.1,93,36,657 ఆదాయం వచ్చింది. యాత్రికుల కానుకల రూపేణ 324 గ్రాముల బంగారం, నాలుగు కేజీల 149 గ్రాముల వెండి, పాత రూ.500 నోటు పది, రూ.వెయ్యి నోట్లు ఐదు, రూ.రెండు వేల నోట్లు ఐదు, పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, అధికారులు, అర్చకులు పాల్గొన్నట్లు తెలిపారు.

యుకె బయలుదేరిన ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 19వ తేదీన యునైటెడ్ కింగ్‌డమ్‌లో జరిగే ఉగాది ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొనున్నట్లు తెలిపారు. గురువారం హైదరాబాదు విమానాశ్రయం నుంచి రోషన్ కుమార్ బయలుదేరుతున్న సందర్భంగా ఆయనకు నియోజవర్గం నుంచి పలువురు నాయకులు వీడ్కోలు పలికారు. యుకెలో తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను నిరంతరం కొనసాగిస్తూ తెలుగువారిలో, ఉత్సాహాన్ని నింపుతూ ప్రతి ఏడాది జరిగే ఉగాది వేడుకల్లో ప్రజలకు సేవ చేయడానికి ప్రజాప్రతినిధిగా ఎన్నికైన రోషన్‌కుమార్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వ్యాపార రంగంలో నూతన ఒరవడులు పారిశ్రామిక అభివృద్ధి తదితర అంశాలపై రోషన్‌కుమార్ ఈ సదస్సులో ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో చింతలపూడి నియోజకవర్గంలోని యువతకు విద్యా ఉపాధి అవకాశాలు, నియోజవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలు చర్చించనున్నట్లు రోషన్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చి ఎంఎల్ఎను మర్యాద పూర్వకంగా కలిశారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని

ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాల వల్ల పలువురు స్వచ్ఛందంగా టిడిపి సభ్యులుగా నమోదవుతున్నారని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులోని టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరణం పెద్దిరాజుతో సహా పలువురు ప్రముఖులకు పార్టీ సభ్యత్వ కార్డులను అందించారు. ఇదే క్రమంలో భీమడోలు మార్కెట్ కమిటీ నూతన అధ్యక్షులుగా నియమితులైన శేషపు శేషగిరికి సభ్యత్వ నమోదు కార్డును అందించడంతో పాటు, బాధ్యతలు స్వీకరించనున్న శేషగిరిని అభినందించారు.

మహిళా రైతులను ప్రోత్సహించేందుకు కృషి


ప్రజాశక్తి - భీమడోలు

మహిళా రైతులను ప్రోత్సహించేందుకు పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సేవలను వినియోగించుకోవాలని వెలుగు భీమడోలు ఎపిఎం కె.రత్నకుమారి కోరారు. ఈ మేరకు మండల పరిధిలో 15 మంది సభ్యులతో ఒక కమిటీని నియమించారు. వీరిలో ముగ్గురు డైరెక్టర్లుగా వ్యవహరించనున్నారు. వీరి ఆధ్వర్యంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ గ్రూపుల నియామకం జరుగుతుంది. ఒక్కొక్క గ్రూపులో పది నుంచి 12 మంది వరకు సభ్యులు ఉంటారు. మండల వ్యాప్తంగా ఈ తరహాలో వంద గ్రూపుల స్థాపన లక్ష్యం కాగా, ఇప్పటివరకు 80 గ్రూపుల నియామకాలు పూర్తయ్యాయి. విధివిధానాలు తెలియజేయడంతో పాటు, ఇతర కార్యక్రమాల నిర్వహణ కోసం భీమడోలు మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం తొలిసారిగా ఎపిఎం అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ కమిటీ సమావేశంలో వ్యవసాయం చేసే మహిళా రైతుల అవసరాలను గుర్తించి మంజూరైన రివాల్వింగ్ ఫండ్ నుంచి రూ.లక్ష వరకు రుణాలను అందిస్తారన్నారు. సకాలంలో వీరు వడ్డీతో సహా చెల్లించిన తర్వాత సదరు మొత్తాలను త్రిఫ్ట్ ఖాతాలుగా గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అవసరం ఉన్న మరొక మహిళ రైతులకు రుణాలుగా ఇస్తామన్నారు. ఈ తరహాలో ప్రభుత్వం రానున్నకాలంలో మరింతగా రివాల్వింగ్ ఫండ్ విడుదల చేయనుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అకౌంటెంట్ సావిత్రితో పాటు, సమాఖ్య సిసిలు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి రూ.2 లక్షల విలువైన పరికరాలు అందజేత

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బయ్యనగూడెం పిహెచ్‌సికి రూ.రెండు లక్షల విలువైన ఆసుపత్రి పరికరాలను అందించినట్లు ఎఎస్ఆర్ ఫౌండేషన్ పిఆర్ఒ ఎవి.రాఘవరావు తెలిపారు. పిహెచ్‌సిలో షెడ్ నిర్మాణానికి రూ.లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.గీతారాణి, ఎఎంసి మాజీ ఛైర్మన్ పారెపల్లి రామారావు, సీనియర్ నాయకులు పోతన తాతారావు, సర్పంచి అనంతలక్ష్మి, టిడిపి మండలాధ్యక్షులు పారెపల్లి నరేష్, జనసేన నాయకులు మద్దు తేజ, కూటమి నాయకులు, వివిధ పార్టీల నాయకులు, డిసిఎం రాజగోపాల్, సీనియర్ మేనేజర్ సిద్దార్థ, లీలకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ జయరాజ్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



పరికరాలు అందిస్తున్న దాతలు

దాతల సాయం అభినందనీయం



ఇనుప బీరువా అందిస్తున్న మానవత సభ్యులు

ప్రజాశక్తి - భీమడోలు

మానవత స్వచ్ఛంద సంస్థ భీమడోలు శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు సభ్యులతో పాటు, దాతలు తమ వంతు సహకారాన్ని అందించడం అభినందనీయమని మానవత జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలను భీమడోలు శాఖ గురువారం చేపట్టింది. దీనిలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో రికార్డులు భద్రపరుచుకునేందుకు మూడు ఇనుప బీరువాలు ఆయా కేంద్రాలకు అందించారు. పొలసానిపల్లి గ్రామంలో పేదరికంతో ఇబ్బందిపడుతున్న ఒక కుటుంబానికి నిత్యావసర వస్తువులు, దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మానవత సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

గర్భిణులు ఆరోగ్యకరంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అంగన్వాడీ విద్యార్థులకు, బాలలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఎలా తీసుకోవాలో, ఏం ఆహారం తీసుకోవాలో, ఎంత పరిమాణంలో తీసుకోవాలో గర్భిణులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు, సిబ్బంది, గర్భిణులు, అంగన్వాడీ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'బిసిలకు 34 శాతం నామినేటెడ్ పదవులు ఇవ్వాలి'

ప్రజాశక్తి - చింతలపూడి

నామినేటెడ్ పదవుల్లో 34 శాతం బిసిలకు అవకాశం కల్పించాలని బిసి సెల్ లింగపాలెం మండలాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని వికెఎం ఫంక్షన్ హాలు వద్ద బిసి నాయకులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం అంటేనే బిసిలు అని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా టిడిపికి అంకిత భావంతో పనిచేస్తున్నామని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గం నాలుగు మండలాధ్యక్షుల్లో మూడు టిడిపి మండలాధ్యక్షుల పదవులు బిసిలకు ఇవ్వాలన్నారు. పార్టీ టౌన్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని కోరారు. అదే విధంగా ఎఎంసి ఛైర్మన్ పదవి బిసిలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్యామ్ సుందర్ శేషు, సాయల సత్యనారాయణ, కొప్పెర్ల నాగరాజు, శ్రీనివాస్ యాదవ్, మరీదు వెంకట్రావు, చెన్ను శ్రీనివాస్ యాదవ్, కొండిబోయిన యువరాజు, తాళం సోంబాబు, చింతపల్లి నాగు, కొండుబోయిన సురేష్, చింతలపూడి నియోజకవర్గ నాలుగు మండలాల బిసి నాయకులు పాల్గొన్నారు.

పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పామాయిల్ రైతుల సమస్యలపై చర్చించి తగు న్యాయం చేయాలని గోద్రెజ్ ఆగ్రో వెట్ రైతు సంఘం అధ్యక్షులు పెన్మత్స రామరాజు కోరారు. మండలం సీతానగరం గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ పామాయిల్ గెలలు వేసిన వెంటనే మెసేజ్ సక్రమంగా రావాలని, పామాయిల్ డబ్బులు వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో పడేలా చూడాలని కోరారు. ట్రైకోడెర్మా, సుడోమొనస్ వంటి మందులు సరఫరా చేయాలని కోరారు. పామాయిల్ ధర వివరాలు కూడా మెసేజ్ రూపంలో పెట్టాలన్నారు. ఇందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్, పి.చక్రధరరావు, కారుమూడి రమేష్, తెగడ వెంకన్న, గుళ్లపల్లి సోమేశ్వరరావు, పిడపర్తి ముత్తా రెడ్డి, ప్రత్తి కోటేశ్వరరావు, పత్తి ప్రసాద్, ఓలేటి కృష్ణ యడ్లపల్లి శ్రీనివాసరావు, తుమ్మల చిట్టి గోవర్ధన్, తుమ్మూరు వెంకటరెడ్డి, కుప్పల చెన్నయ్య, అల్లు సత్యనారాయణ రెడ్డి, కుప్పాల సురేష్, తుల్లిమెల్లి జాన్, మిరియాల సామ్యూల్, ఇబ్బ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

పెదవేగి మండలం పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కెవి వేగివాడ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఆర్‌డిఎస్ఎస్ పథకం పని నిమిత్తం ఈ నెల 18వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా వేగివాడ సబ్ స్టేషన్ పరిధిలోని పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఉంగుటూరులో రైస్ మిల్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరులో శ్రీ వల్లభ మోడరన్ రైస్‌మిల్లును కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ గురువారం ప్రారంభించారు. చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారాలు కల్పించి ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్న రైతు నాయకులను మంత్రి అభినందించారు. గ్రంధి సాయిబాబా వరప్రసాద్, పసుపులేటి వెంకటరామారావు, సరిశే సోమేశ్వరరావు, గ్రంధి నాగ వెంకట మణికుమార్ వాటాదారులుగా ఏర్పాటు చేసిన ఈ రైస్‌మిల్లు నూతన వ్యాపారాన్ని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్‌సి సోము వీర్రాజు, మాజీ ఎంపీ మాగంటి బాబు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీ రాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండలాధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

HMOP No.53/2024

బిట్వీన్:
నడింపల్లి శ్రీరామరాజు ..పిటీషనర్
V/s
శ్రీమతి నడింపల్లి చంద్రవతి ..రెస్పాండెంట్

నోటీసు
టు,
శ్రీమతి నడింపల్లి చంద్రావతి, భర్త: నడింపల్లి శ్రీరామరాజు, తండ్రి: జంపన రామరాజు, మహిళ, గృహిణి, వయస్సు 57 సం॥రాలు, డోర్ నెం.1-52/2, పెదలంక గ్రామం, నరసాపురం మండలం, ప॥గో॥జిల్లా, ఆం.ప్ర., ప్రస్తుతం భీమనపల్లి గ్రామము, ఉప్పలగుప్తం మండలం, డా॥బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆం.ప్ర., పై నెంబరు **HMOP No.53/2024** పిటీషన్‌లో రెస్పాండెంట్ అయిన మీకు కోర్టువారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను అమలు జరుగనందున శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మీరు ది.02.05.2025వ సం॥రం తేదీన ఉదయం 10:30 ని॥లకు శ్రీకోర్టు వారి ముందు స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు కాని ఆక్షేపణలు గాని తెలియజేయవలెను. లేనియెడల సదరు **HMOP No.53/2024** పిటీషన్‌ను మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

Katikala Yesubabu, B.Com., B.L.,
Advocate
నరసాపురం Narsapuram-534275, W.G.Dist.,
తేది: 18.04.2025 A.P., Cell: 9133530801

TANUKU MUNICIPALITY

Roc. No. TNK Mplty/843/2025/E1, Dt.16-04-2025

NOTICE INVITING EXPRESSION OF INTEREST

Expression of interest is invited from the interesting Architectural Firms to present different concept facade 3D visuals, elevation and interiors for the aesthetic works, development of Parks, Dividers, Islands and Play Zones etc., including preparation of Plans, designs, drawings, detailed & abstract estimates etc.., includig technical approval from concerned department Engineering authorities for the Architectural works taken up in Tanuku Municipality.

The short listed firms will be invited to submit technical and financial bids.

Sales of Tender Schedule : 21-04-2025 to 24-04-2025 (up to 1:00 PM)
Submission of EOI on : 24-04-2025 up to 3:00 PM
Opening of Technical Bid : 24-04-2025 at 4:00 PM
Cost of Tender Schedule : Rs.2,000/-

For further details please contact in working hours (Ph.08819224056 & 9849906557)

Sd/- **COMMISSIONER,** TANUKU MUNICIPALITY

In The Court Of The Hon'ble Principal Civil Judge (Senior Division) at Vijayawada

S.O.P.No.02 of 2025

Between:
1. Koduri Venkata Sita Mahalakshmi
2. Siram Suneetha
...Petitioners
AND
Nill ***...Respondents***

GENERAL NOTICE

The above Petitioners filed the above case for Succession Certificate in the wake K.Subrahmanyam who was died intestate leaving behind the above petitioners as her legal heirs for which she had shares and debentures in IIFL Securities Ltd which has its BO Code No.130144000119904 for which the General notice is ordered on 17-03-2025 by the Hon'ble Principal Civil Judge Court (Senior Division), Tadepalligudem. If anybody having any bojections / claims may appear before the Hon'ble Principal Civil Judge Court (Senior Division), Tadepalligudem **on 29-04-2025 by 10:30 A.M.** failing which the Hon'ble Court treat the same as their no objection for issuing of Succession Court treat the same as their no objection for issuing of Succession Certificate in favour of the petitioners. Hence this General Notice.

KAKARAPARTHI NAGA SRIDHAR,
PRATHIPATI STIMEL RATANDEEP,
Advocates,
Tadepalligudem Camp at Vijayawada.
Cell : 9291664444

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా

AA/CF/No.57 of 2022

బిట్వీన్:
మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ భీమవరం, Rep. by its ఫోర్‌మెన్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ ఎ.మాధవరావు. ***...డిస్ప్యూటెంట్***
అండ్

అపోనెంట్ నెం.2: తాళ్ళూరి లక్ష్మి, భర్త: టి.వి.ఎస్.సుబ్బారావు, R/A: డో.నెం.26-5-3/6, సూర్యతేజస్ నగర్, దొడ్డిపట్ల రోడ్, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో అపోనెంట్ నెం.2 అను వార్కి ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటరు వారు మీ హాజరు నిమిత్తం **ది.22-04-2025 వ తేదీకి వాయిదా వేసినారు. కావున ఆరోజు ఉదయం గం॥10:30 ని॥లకు శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ ఆర్బిట్రేటరు వారి ఎదుట స్వయంగా గాని లాయరు గారి ద్వారా గాని హాజరై తగు ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను.** లేనిచో సదరు దావా గ్రంధము మీ పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేదీ : 22-04-2025

శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటరు వారి ఉత్తర్వుల ప్రకారం

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రై॥ లిమిటెడ్, భీమవరం ఫోర్‌మెన్, భీమవరం, ప॥గో॥జిల్లా.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా

AA/CF/No.58 of 2022

బిట్వీన్:
మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ భీమవరం, Rep. by its ఫోర్‌మెన్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ ఎ.మాధవరావు. ***...డిస్ప్యూటెంట్***
అండ్

తాళ్ళూరి వెంకట సత్యసుబ్బారావు, తండ్రి: టి.పుల్లారావు(లేట్) & ఇతరులు ***...అపోనెంట్స్***

అపోనెంట్ నెం.2: తమ్మినీడి అనంతలక్ష్మి, భర్త: టి.సత్యనారాయణబాబు, R/A: డో.నెం. 16-2-753/13, తిరుమల అపార్ట్‌మెంటు ఎదురుగా, రెవెన్యూ బోర్డు పార్కు దగ్గర, రెవెన్యూ బోర్డు కాలనీ, గడ్డిఅన్నారం, న్యూమల్క్ పేట, హైదరాబాదు, తెలంగాణ రాష్ట్రం.

అపోనెంట్ నెం.3: బలుసు పద్మశ్రీ, భర్త: బి.కొండలరావు, R/A: హెచ్.పి.పెట్రోలు బంకు వెనుక, ఏలూరు రోడ్, భీమడోలు, ఏలూరు జిల్లా.

అపోనెంట్ నెం.4: తాళ్ళూరి లక్ష్మి, భర్త: టి.వి.ఎస్.సుబ్బారావు, R/A: డో.నెం.26-5-3/6, సూర్యతేజస్ నగర్, దొడ్డిపట్ల రోడ్, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో అపోనెంట్స్ నెం.2, 3, 4 అను వార్కి ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయు చున్నందున శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటరు వారు మీ హాజరు నిమిత్తం **ది.22-04-2025 వ తేదీకి వాయిదా వేసినారు. కావున ఆరోజు ఉదయం గం॥10:30 ని॥లకు శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ ఆర్బిట్రేటరు వారి ఎదుట స్వయంగా గాని లాయరు గారి ద్వారా గాని హాజరై తగు ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను.** లేనిచో సదరు దావా గ్రంధము మీ పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేదీ : 22-04-2025

శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటరు వారి ఉత్తర్వుల ప్రకారం

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రై॥ లిమిటెడ్, భీమవరం ఫోర్‌మెన్, భీమవరం, ప॥గో॥జిల్లా.

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.A.No.89/2016 in E.P.No.69/2012 in O.S.No.358/2006

బిట్వీన్:
మైలే కిషోర్ బాబు
...పిటీషనర్ /ఆక్షన్ పర్చేసర్
మరియు

1. మైలే బాబు ***...డి. హెచ్. ఆర్***
2. గొల్లమందుల సూర్యకాంతమ్మ (డైడ్)
3. గొల్లమందుల వెంకటేశులు
4. గొల్లమందుల పెద్దిరాజు
5. గొల్లమందుల మైఖేశ్వరరావు
6. గొల్లమందుల యాకోబ్‌రాజు
7. కుసుమే విజయ లక్ష్మి
8. జిల్లెల్ల మారతమ్మ
9. ఉన్నమట్ల మణికుమారి ***...జె.డి.ఆర్స్***

పై నెంబరు పిటీషన్లో 3,5,6 మరియు 9వ జె.డి.ఆర్స్ ఎన్ని పర్యాయాలు శ్రీ కోర్టు వారు మీకు నోటీసులు పంపించినప్పటికీ మీరు ఉద్దేశపూర్వకంగా నోటీసులు అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేసియున్నారు. పిటీషన్ ది.26-06-2025వ తేదీనకు వాయిదా అయివున్నది. కావున మీరు వ్యక్తిగతంగా గాని లేదా మీ పరోక్షమున ప్లీడరు గారి ద్వారా గాని **ది.26-06-2025వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను.** సదరు పిటీషనుకు మీరు హాజరు కాని ఎడల మీ పరోక్షమున పిటీషను గ్రంధము జరుపబడునని తెలియచేయడమైనది.

(By Order)

దిరిశాల ఎన్.వి.హరగోపాల్
B.Com., L.L.B.,
న్యాయవాది, పాలకొల్లు.
ది.16-4-25. సెల్: 9989006916